ఆర్థిక వ్యవస్థకు ఆర్యవైశ్యులే వెన్నుముక: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

❖ ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులకు ఘన సత్కారం

దశ, హైదరాబాద్ : తెలంగాణ సమాజం, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో ఆర్యవైశ్యుల పాత్ర ఎంతో కీలకమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న కిరాణా దుకాణాల నుంచి మహానగరాల్లోని భారీ పరిశ్రమల వరకు ఆర్యవైశ్యులు తమదైన ముద్ర వేస్తూ సప్లై చైన్ వ్యవస్థకు వెన్నుముకగా నిలుస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని చంపాపేటలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సత్కారం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి టి.జి. వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే బేగల గణేష్ గుప్త, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన ఆర్యవైశ్య ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రజాసేవను బాధ్యతగా భావించి సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. వ్యాపార ధర్మాన్ని పాటిస్తూ, తమ ఆదాయంలో భాగాన్ని సమాజ శ్రేయస్సు కోసం వెచ్చించడంలో ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. పన్నుల రూపంలో ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూర్చడంతో పాటు సంక్షేమ పథకాల అమలుకు ఆర్యవైశ్యులు పరోక్షంగా సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్యవైశ్య వర్గంలో ఉన్న పేద కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక కాంట్రాక్టులపై తుడుం దెబ్బ ఆందోళన

దశ, కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోదావరి పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న ఇసుక తదితర కాంట్రాక్ట్ పనుల్లో స్థానిక గిరిజనులకు అన్యాయం జరుగుతోందని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన త్యాగాల ఫలితాలు స్థానిక ప్రజలకు అందకుండా, నీళ్లు, నిధులు, నియామకాల ప్రయోజనాలు ఇతర ప్రాంతాల వారికి మళ్లుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న ఐదవ షెడ్యూల్, వన్ బై సెవెంటీ, పిసా చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి నిబంధనలను ఉల్లంఘిస్తూ సహజ వనరుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోకి వచ్చిన కొందరు ఆంధ్ర కాంట్రాక్టర్లు స్థానిక గిరిజనుల భూములు, అడవులు, సహజ వనరులను దోచుకుంటున్నారని, దీనికి కొంతమంది అధికారులు సహకరిస్తున్నారని అలెం కోటి విమర్శించారు.

కోట్ల రూపాయల విలువైన సహజ వనరుల వినియోగంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొంతమంది కాంట్రాక్టర్లు రాజకీయ అండదండలు ఉన్నాయని బహిరంగంగా వ్యాఖ్యానించడం గిరిజన సమాజానికి, తెలంగాణ ప్రజలకు అవమానకరమని పేర్కొన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, మేధావులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆదివాసి హక్కుల పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని, ప్రభుత్వానికి ప్రజాస్వామ్య పద్ధతుల్లో గుణపాఠం చెబుతామని తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలెం కోటి హెచ్చరించారు.

ఓయూలో ప్రారంభమైన గిరిజన సంస్కృతి - రెండు రోజుల జాతీయ సదస్సు

దశ ఓయూ: ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో రీజినల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ సెమినార్ హాల్‌లో "గిరిజన సంస్కృతి, జీవనం: గతం, వర్తమానం భవిష్యత్తు" (Tribal Lore and Life: Hind sight, Insight and Foresight) అనే అంశంపై, తెలుగు రాష్ట్రాల ప్రత్యేక ప్రస్తావనతో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా శుక్రవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా మధ్యప్రదేశ్ గవర్నర్ సలహాదారు దీపక్ ఖండేకర్ హాజరై కీలకోపన్యాసం చేశారు. గిరిజన సమాజాలు, పరిపాలన మరియు సమ్మిళిత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన తన అమూల్యమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

మధ్యప్రదేశ్‌తో పాటు పరిసర గిరిజన ప్రాంతాలలో తనకున్న విశాల పరిపాలనా అనుభవాన్ని ప్రస్తావిస్తూ, దేశంలోని వివిధ ప్రాంతాలలో గిరిజనులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక మరియు అభివృద్ధి సంబంధిత సవాళ్లు దాదాపు ఒకే స్వరూపంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఇటువంటి సదస్సుల ద్వారా విధానపరమైన చర్చలు, సమిష్టి కార్యాచరణలు, సార్థక జోక్యాలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు.

తెలంగాణలోని సమ్మక్క సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ తన అధ్యక్ష ప్రసంగంలో ములుగు జిల్లాలో స్థాపించబడిన ఈ విశ్వవిద్యాలయం ప్రత్యేక లక్ష్యాలు, దృష్టికోణం మరియు గిరిజన సమాజాల పట్ల దాని నిబద్ధతను వివరించారు. విశ్వవిద్యాలయం యొక్క లోగో (ముద్ర) గిరిజన భాషలు, సంస్కృతి మరియు విలువల స్ఫూర్తితో కూడిన "విద్య - వివేకం - వికాసం" అనే తాత్విక భావనలను ప్రతిబింబిస్తుందని తెలిపారు. అంతేకాకుండా, ములుగు జిల్లాలోని గిరిజన సమాజాలపై విశ్వవిద్యాలయం ఇప్పటికే పలు పరిశోధనాత్మక అధ్యయనాలు చేపట్టిందని, కమ్యూనిటీ హెల్త్‌లో డిప్లొమా కోర్సులు, కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన సర్టిఫికేట్ కోర్సులను ప్రారంభించిందని వెల్లడించారు. గిరిజన సమాజాలపై సాంస్కృతిక లక్షణాలు, సామాజిక సంబంధాలు, భౌగోళిక పరిస్థితుల ప్రభావం వంటి అంశాలను కూడా ఆయన విశ్లేషించారు. ఆయన ప్రసంగం సదస్సుకు మేధోపరమైన దిశానిర్దేశం చేసింది.

ఈ సదస్సు రూపకల్పన మరియు నిర్వహణలో కీలక పాత్ర పోషించిన సామాజిక సమరసత జాతీయ కన్వీనర్ కె. శ్యామ్ ప్రసాద్, 35 గిరిజన తెగల సామాజికసాంస్కృతిక జీవన విధానాలపై విస్తృతంగా మాట్లాడారు. రెండవ రోజు గిరిజన తెగలపై తాను రచించిన పుస్తకాన్ని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గిరిజన సమాజాల మధ్య ఐక్యత, పరస్పర సహకారం మరియు సామాజిక సమగ్రతను పరిరక్షించాల్సిన అవసరాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో గిరిజనుల ప్రస్తుత సామాజికఆర్థిక పరిస్థితులను వివరిస్తూ, వారి సాధికారత కోసం సమిష్టి కృషి అవసరమని పిలుపునిచ్చారు. తెలుగు సాహిత్యం మరియు గిరిజన అధ్యయనాలలో విశేష కృషి చేసిన ప్రముఖ పండితులు ప్రొఫెసర్ పొలిగొండ సుబ్బాయ చారి గారు గిరిజన సంస్కృతి, సాహిత్యం మరియు సామాజిక వాస్తవాలపై విలువైన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. షెడ్యూల్డ్ కులాలు (SC), షెడ్యూల్డ్ తెగలు (ST) ఎదుర్కొంటున్న భిన్నమైన అభివృద్ధి సమస్యలను ఆయన విశ్లేషించారు. గిరిజన సమాజాల అభ్యున్నతికి ప్రభుత్వాలు, విద్యాసంస్థలు మరియు సంబంధిత సంస్థలు మరింత సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జాతీయ జీవనోపాధి కార్యక్రమాలను బలోపేతం చేయాలని, అటవీ శాఖతో సహా ప్రభుత్వ విభాగాల భాగస్వామ్యం గిరిజన సంక్షేమంలో మరింత పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. ప్రభాకర్ ధన్యవాదాలు తో మొదటి రోజు సదస్సు ముగిసింది. ప్రారంభోత్సవ సమావేశం అందులో జరిగిన చర్చలు సదస్సును అత్యంత అర్థవంతంగా, మేధోపరంగా ఆలోచింపజేసేలా తీర్చిదిద్దాయి. టెక్నికల్ స్టేషన్స్, పేపర్ ప్రజెంటేషన్ వంటి కార్యక్రమాలు జరుగుతాయి అన్నారు. శనివారం సైతం ఈ సదస్సు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఆదివారం పాదయాత్ర

❖ గ్రామాల పరిరక్షణ కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు

దశ, అబ్దుల్లాపూర్ మెట్ : గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 268లో 494 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదిత ఎకో టౌన్ (డంపింగ్ యార్డ్) ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఉదయం 9 గంటలకు గోలేటి చౌరస్తానుంచి సద్దుపల్లి చౌరస్తావరకు పాదయాత్రచేపట్టి, అనంతరం నిరసన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ యువత, రైతులు, మహిళలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో గ్రామాల పర్యావరణం, భూగర్భ జలాలు, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల భవిష్యత్తు, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. "మన గ్రామాలను మనమే కాపాడుకోవాలి. ఇది ఒక్కరి సమస్య కాదు.. అందరి బాధ్యత" అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆదివారం జరిగే పాదయాత్ర, నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

2 సార్లు ఫొటో దింపే విధానం రద్దు చేయాలి

❖ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి అంజయ్య

దశ, యాచారం : 2 సార్లు ఫొటో దింపే విధానం రద్దు చేయాలి రంగారెడ్డి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి అంజయ్య అన్నారు. శుక్రవారం మాల్ కిషన్ పల్లి గ్రామాలలో సంఘం సభ్యత్వం చేర్పించి అనంతరం. కూలీల సమస్యలు అడిగి తెలుసుకొని మాట్లాడుతూ. బిజెపి కేంద్ర ప్రభుత్వం 2వ సారి అధికారంలో కి వచ్చాక ఉపాధి హామీ చట్టాన్ని తీసివేసే పనిలో భాగంగా ఇప్పటికే అనేక మార్పులు చేర్పులు చేస్తూనే మహాత్మా గాంధీ పేరుతో వున్నా చట్టాన్ని తీసివేసి G Ram G చట్టాన్ని తెస్తున్న పరిస్థితి వుంది దేశంలో కోట్లాది మందికి కావాల్సిన బడ్జెట్ 2 లక్షల 50 వేలకోట్లు అవసరం వుంటే కేవలం 90 వేలకోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకుంది.

కూలీలు 2 పూటల ఫొటోల కోసం గంటల తరబడి ఉండ వలసి వస్తుంది. సిగ్నల్ లేఖ ఫోటో లు రాకపోవడం కొంత మందికి ఐరిస్ రాకపోవడం వలన కూలీలు ఏడ్చుకుంటూ ఇంటికి వస్తున్నారు ఫోటో ల వలన ఎఫ్ఏ లు సీనియర్ మేట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిజెపి ప్రభుత్వం తెచ్చిన మార్పుల వలన పని ప్రదేశం లో కనీసం నీడా నీళ్లు లేవు దెబ్బలు తగిలితే ప్రధమ చికిత్స చేద్దామన్న మెడికల్ కిట్లు లేవు. కూలీలకు వడ దెబ్బ కొట్టకుండా పని ప్రదేశంలో ఓవ రేస్ ప్యాకెట్లు మజ్జిగ ఇవ్వడం లేదు బిజెపి కేంద్ర ప్రభుత్వం పొమ్మన లేఖ పొగపెట్టె పద్ధతులలో వ్యవరించడం వలన కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దీనివలన మండలం లో కూలీల సంఖ్య రోజురోజు తగ్గుతున్నారని అన్నారు. మహాత్మా గాంధీ పేరుతో వున్నా చట్టం 2005 ను కొనసాగించాలని కనీస వేతన చట్ట ప్రకారం రోజుకూలీ 800 రూపాయలు ఇవ్వాలి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి, సీనియర్ మేట్లను పీల్డు అసిస్టెంట్లుగా తీసుకోవాలి పీల్డు అసిస్టెంట్లకు కనీస వేతనం 26000 వేలు జీతం ఇవ్వాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సంఘం మండల ఉపాధ్యక్షులు బెల్లి ఇందిరమ్మ , కూలీలు సీనియర్ మేట్లు సాయులు , పర్వతాలు , వెంకటయ్య , రాజు , రాములు వెంకటేష్ , తదితరులు , పాల్గొన్నారు.

ఉమ్మడి నల్గొండలో బీజేపీకి ఉజ్వల భవిష్యత్: బూర నర్సయ్య గౌడ్

దశ, యాదగిరిగుట్ట: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని సౌభాగ్య రిసార్ట్‌లో భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్-2026 సమారోప కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ అల్లేటి మహేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ మరియు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో మాట్లాడిన డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలోపేతం, ప్రజాసేవలో కార్యకర్తల పాత్రపై విస్తృతంగా వివరించారు.

దేశంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే లక్ష్యంతో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ప్రతిపాదించిన అంత్యోదయ సిద్ధాంతాన్ని ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీజేపీ బలపడుతోందని, రాబోయే ఎన్నికల్లో 4 నుంచి 5 అసెంబ్లీ స్థానాలను గెలుచుకునే అవకాశాలు ఉన్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జిల్లాలో బీజేపీ మరింత బలంగా ఎదిగి అధిక స్థానాల్లో విజయం సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలు, నాయకత్వ నైపుణ్యాలు, సామాజిక బాధ్యతలపై కార్యకర్తలకు అవగాహన కల్పించడమే ప్రశిక్షణ మహాభియాన్ లక్ష్యమని నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధోనూరు వీరారెడ్డి, దూదల భిక్షంతో పాటు జిల్లా, మండల, మోర్చా నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలి

దశ సూర్యాపేట ప్రతినిధి : ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపునిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేయాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యామ రమేశ్, జూలకంటి వెంకట్ రెడ్డిలు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ లో 30000 మంది ఉపాధ్యాయులు టెట్ పాస్ కావాల్సిన అవసరం ఉంది. 1 ఏప్రిల్ , 2010 పూర్వం న్యాయ బద్దంగా నోటిఫికేషన్ వచ్చి నియామకం అయిన ఉపాధ్యాయులకు ఆనాడు టెట్ అవసరం లేదు అని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. 1 ఏప్రిల్ ,2010 విద్యా హక్కు రూల్స్ కు అనుగుణంగా యన్ సీ టీ ఈ, టెట్ నిబంధనలు చేర్చింది. ఈ నిబంధనల ఆధారంగానే సుప్రీం కోర్ట్ తీర్పు ఇచ్చింది. ఇది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అన్యాయం కల్గిస్తుంది. గత 30 సంవత్సరాలనుండి ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న విషయం లో భోదిస్తున్నారు.

టెట్ లో మాత్రం అన్ని విషయాలు కలిపి పరీక్షలు పెట్టడం జరుగుతుంది. భాషా ఉపాధ్యాయులు, టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి చేయడం అసంబద్ధ నిర్ణయంగా తపస్ అనేక మార్లు ప్రభుత్వాలకు నివేదించింది . తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్డినెన్స్ తెచ్చి

1 ఏప్రిల్ , 2010 కన్న ముందు వేసిన నోటిఫికేషన్ ద్వారా నియామకాలు అయిన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నాము. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వం ను ఒప్పించేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. ఈ సమావేశంలో తపస్ జిల్లా కోశాధికారి సురభి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షులు బైరు తిరుమలేష్, జిల్లా కార్యదర్శి నాగిరెడ్డి జితేందర్ రెడ్డి, అమరవాది బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి

- కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఓట్ల తొలగింపునకు కుట్ర
- బీహార్, బెంగాల్ ఫార్ములాను దేశం అంతటా ప్రయోగిస్తున్నారు
- రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

దశ, ఖమ్మం: కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై, పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) అవగాహన శిక్షణ శిబిరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్యకర్తలకు, ఏంజెట్లకు కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను పసిగట్టి ఏ విధంగా తిప్పికోట్టాలో మార్గనిర్దేశనం చేశారు.

కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం లాంటిది, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యే అని నేను భావిస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో.. అక్కడ ఒక పద్ధతి ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్ ఓట్లు'గా చిత్రీకరించి, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోంది. బీజేపి వాళ్లు గెలవలేని చోట ప్రత్యర్థి ఓటును కూడ గల్లంతు చేస్తుంది. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ ఉన్నా.. వాటన్నింటినీ వంకగా చూపి ఓట్లను లేపేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీహార్, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలని సూచించడం జరిగింది. ఓట్లతో పాటు..ఏకంగా సీట్లే దొంగిలిస్తున్నారు. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతమే సాక్ష్యం..మీనాక్షి నటరాజన్ గారికి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్ను తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు. ఓట్లనే కాదు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి కేంద్రంలో బీజేపి ప్రభుత్వం దిగజారింది.

కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ , ఈడీ , ఇన్కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య బద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారు. ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి..జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించడం జరిగింది. ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్లలో ఉండే మన వాళ్ళు అధికారులు వచ్చినప్పుడు ఊర్లోలేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలి. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడ లాగా కాపాడుకోవాలి.

దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కాబోయే ప్రధానమంత్రి, మన నాయకుడు రాహుల్ గాంధీకి కార్యకర్తలంతా సైనికుల్లా అండగా నిలబడాలని, ఈ అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునివ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్ల బి.ఎల్. ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మణుగూరు ఐటిఐ ప్రిన్సిపాల్గా బాధ్యతలు చేపట్టిన సారంగపాణి

దశ, మణుగూరు: మణుగూరు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ గా ఓ సారంగపాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో భూపాలపల్లి ఐటిఐలో ట్రైనింగ్ ఆఫీసర్గా పనిచేసిన ఆయన పదోన్నతిపై మణుగూరుకు రావడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఐటిఐలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. విద్యార్థుల్లో శిక్షణ నైపుణ్యాలను పెంపొందించడానికి కృషి చేస్తానన్నారు. అదేవిధంగా ఐటిఐ ప్రవేశాల కోసం ఈనెల 30 వరకు గడువు ఉన్నందున స్థానిక యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాలలో సైతం ఆధునిక సాంకేతికరణ పెంపొందించడం కోసం ప్రభుత్వం ఐటిఐలలో ఏటీసీ కోర్సులను ఏర్పాటు చేసి అడ్వాన్స్డ్ టెక్నాలజీ కోర్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు ఇక్కడ ఇంచార్జ్ బాధ్యతలు నిర్వహించిన సాగర్ ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వరరావు వారికి అభినందించి నలుగురు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా కా ఐటిఐ ఎటిసి ఉద్యోగులు సిబ్బంది నూతన ప్రిన్సిపాల్ ను సాధారంగా ఆహ్వానించే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ సూపరిండెంట్ జ్యోతిరాణి సీనియర్ అసిస్టెంట్ సాధన, ఏటీవోలు జీవి కృష్ణారావు, ఎం శ్రీనివాసరావు, ఏ నర్సయ్య, వేణుగోపాల్ నాయుడు, కే ధర్మయ్య, ఏటీసీ మాస్టర్ ట్రైనర్ పూర్ణచంద్రరావు ఇతర సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యం

- పోలీస్ సిబ్బందికి గుండె వైద్య పరీక్షలు: ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్

దశ, ఖమ్మం: పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల ఆరోగ్యానికి పోలీస్ శాఖ ప్రాధాన్యమిస్తోందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. ఖమ్మం ఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్లో హైదరాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఈసీజీ, టూడీ ఈకో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉంటేనే విధులను సక్రమంగా నిర్వహించ గలుగుతారని, కుటుంబంలో ప్రశాంత ఉంటుందన్నారు. స్వీయ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విధినిర్వహణలో పోలీస్ సిబ్బంది ఎదుర్కొనే ఒత్తిడి కారణంగా గుండె జబ్బులు, ప్రాణాంతక సమస్యలను ముందుగానే గుర్తించి నివారించడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమైన గుండె వైద్య పరీక్షలు ఈసీజీ, టూడీ ఈకో పరీక్షలను యశోద వంటి ప్రముఖ ఆసుపత్రుల సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి, సిబ్బందికి ఈ ఆరోగ్య ప్రొఫైల్స్ను అందిస్తున్నాయట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ యశోద హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు భరత్ రెడ్డి, సీనియర్ మేనేజర్ వినయ్ కుమార్, ఎస్బీ ఏసీపీ మహేష్, ఏ.ఆర్, ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్ సాంబశివరావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్తో వేగంగా న్యాయం

- రాజీ కేసులు అధికంగా పరిష్కరించాలి
- న్యాయవాదులతో డీఎల్ఎస్ప కార్యదర్శి రాజేందర్ సమావేశం

దశ, మణుగూరు: పెండింగ్లో ఉన్న రాజీ చేయదగిన కేసులను జూన్ 20న నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్ ద్వారా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవాసంస్థ(డీఎల్ఎస్ప)కార్యదర్శిరాజేందర్న్యాయవాదులకు సూచించారు. స్థానిక మణుగూరు కోర్టులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం పెండింగ్లో ఉన్న సివిల్, క్రిమినల్, చెక్కు బౌన్స్ తదితర రాజీ చేయదగిన కేసులను గుర్తించి లోక్ అదాలత్కు తీసుకురావాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో పరిష్కారమవుతాయని, దీనివల్ల కక్షిదారులకు సమయం, ధనం ఆదా అవుతాయని తెలిపారు. ప్రజలకు సత్వర న్యాయం అందించాలనే లక్ష్యంతో లోక్ అదాలత్ను విజయవంతం చేసేందుకు న్యాయవాదులు తమ వద్ద ఉన్న రాజీ కేసులను గుర్తించి సంబంధిత కక్షిదారులను హాజరుపరచాలన్నారు. న్యాయవాదుల సహకారంతో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించి ప్రజల్లో న్యాయ సేవలపై మరింత విశ్వాసం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో మణుగూరు కోర్టు న్యాయమూర్తి కంబపు సూరి రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాని గురుకృష్ణ, జనరల్ సెక్రటరీ వీర మధుసూదన్, న్యాయవాదులు కుర్మ విజయరావు, బద్దం శ్రీనివాస్ రెడ్డి, వీరంకి పద్మావతి, వాసవి, రమేష్, సునీత, సుస్మిత, ప్రియాంకతో పాటు కోర్టు న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించండి

- BRSV పాల్వంచ టౌన్ అధ్యక్షులు జూపెల్లి దుర్గాప్రసాద్
- అదనపు కలెక్టర్కి, జిల్లా విద్యాశాఖా అధికారులకు వినతి

దశ, పాల్వంచ: కొత్తగూడెం కార్పొరేషన్ పాల్వంచ పరిధిలో ఉన్నటువంటి వివిధ రకాల విద్యార్థుల సమస్యలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ విద్యాచందనకి, విద్యాశాఖ అధికారులుకు BRS పార్టీ విద్యార్థి విభాగం పాల్వంచ పట్టణ అధ్యక్షులుజూపెల్లి దుర్గాప్రసాద్ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా జూపెల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలు కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయని త్వరలో స్కూల్ ప్రారంభమవుతున్నాయని వచ్చేది వర్షాకాలం కావున స్కూల్ లను మరమ్మత్తులు చేయాలన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేయడమే కాకుండా, నోట్ బుక్స్ స్కూల్లో వద్దే కొనాలని ప్రైవేటు పాఠశాల యాజమాన్యం బెదిరిస్తున్నారని అని, ప్రైవేటు పాఠశాలల్లో ఎక్కువగా పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలు చదువుతారని ఎందుకంటే వారు చదువుకోకపోయినా పిల్లల భవిష్యత్తు బాగుండాలని మెరుగైన విద్యను అభ్యసించాలని కోరుకొని, ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తే యాజమాన్యాలు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ సంవత్సరానికి ఒకసారి ఫీజులు పెంచుతూ అంతే కాకుండా బుక్షాప్ లో తక్కువగా దొరికే నోటుబుక్కులను, అధిక రేట్లకు అమ్ముతున్నారన్నారు.

అదేంటి అని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక అప్పులు చేసి ఆర్థికంగా చితికి పోతున్నారని, మరియు, ప్రైవేటు పాఠశాలల బస్సులు ఎటువంటి ప్రమాణాలు లేకుండా నడుపుతున్నారని అధికారులకు తెలియజేస్తూ, ఇప్పటికైనా ప్రభుత్వం ఈ యొక్క సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఇట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరగా సానుకూలంగా స్పందించిన అధికారులు సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు,మరియు, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిగా, ఉన్నటువంటి రేవంత్ రెడ్డి గారు, ఫీజు నియంత్రణ కమిటీ వేసి ఫీజులను నియంత్రిస్తానని చెప్పి మూడు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు ఫీజు నియంత్రణ చేయలేదని, రేవంత్ రెడ్డి గారు విద్యార్థుల గురించి మాట్లాడుతూ, మేము అందరికీ అందించేది విద్య ఒక్కటే అని అదే రేపు మన భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు.

మరి ఇటువంటి మాటలు మాట్లాడిన రేవంత్ రెడ్డి గారు, ఇప్పటివరకు ఎందుకు ఫీజు నియంత్రణ చేయలేదని, స్కాలర్షిప్ బకాయిలు ఎందుకు విడుదల చేయలేదని, ప్రైవేటు పాఠశాలల్లో అధికంగా డబ్బులు దోచుకుంటున్న మౌనంగా ఎన్నుకున్నారని, గురుకులాలో తరచూ ఫుడ్ పాయిజన్లు అవుతున్న ఎందుకు పట్టించుకోవట్లేదని ఆయన ప్రశ్నించి, త్వరితగతిన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని లేదంటే విద్యా శాఖ మంత్రి పదవి నుండి తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ, రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున విద్యార్థుల సమస్యల పట్ల ఉద్యమిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి పాల్వంచ పట్టణ ప్రధాన కార్యదర్శి కంచర్ల రామారావు, శ్రీకాంత్, మెహతాబ్, ముఖేష్, సతీష్, వాసుమల్ల గౌతం, తనీష్, తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

- డి.ఎల్.ఎస్.ఎ సెక్రటరీ రాజేందర్

దశ, మణుగూరు: బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మణుగూరు శ్రీవిద్య జూనియర్ కళాశాల లో బాలల కార్మిక వ్యతిరేక దినోత్సవ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాల్పోస్టర్ ఆవిష్కరించారు. 14 సంవత్సరాలలో పిల్లలు బాల్ కార్మికులు ఎక్కడైనా పని చేసినట్లయితే తక్షణమే 1098 గాని, 100 గానీ చైల్డ్ లైన్ విభాగానికి సమాచారం అందించాలని డి .ఎల్.ఎస్. ఏ సెక్రటరీ రాజేందర్ ప్రజలకు సూచించారు.. ఈ కార్యక్రమంలో సీఐ నాగబాబు. ఏ.ఎల్ .ఓ రజిత, సుశీల, ఇందిరా, హైమావతి, భద్రమ్మ, శ్రీను, కోటేష్, రాజేష్, మోహన్ జ్యోతి, మౌనిక లు పాల్గొన్నారు.

నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి

- ఖమ్మం పోలీస్ కమిషనర్ను కలిసిన BRS జిల్లా పార్టీ బృందం
- మైనర్ బాలికపై దారుణానికి ఒడిగట్టిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఖమ్మం ఎమ్మెల్సీ, BRS పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ రావు

దశ, ఖమ్మం: ఖమ్మం నగరంలో 12 ఏళ్ల మైనర్ బాలికపై జరిగిన అమానుష, ఘోరమైన ఘటనను భారత రాష్ట్ర సమితి (BRS) ఖమ్మం జిల్లా పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ విషయమై బీఆర్ఎస్ MLC మరియు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతా మధుసూదన్ నాయకత్వంలో పార్టీ ప్రతినిధుల బృందం శుక్రవారం ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించింది. సభ్య సమాజాన్ని తీవ్రంగా కలచివేసిన ఈ ఘటనలో బాధిత బాలికకు తక్షణమే న్యాయం చేయాలని, నిందితుడిపై పోక్సో (POCSO) చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ బృందం డిమాండ్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాల పట్ల ఈ సందర్భంగా వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిందితుడిపై పోక్సో చట్టంతో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని,

బాధితురాలికి త్వరితగతిన న్యాయం జరిగేలా కేసును ఫాస్ట్ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలని, బాధిత బాలికకు ప్రభుత్వం తరపున అవసరమైన వైద్య, ఆర్థిక, మరియు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ భద్రత తక్షణమే కల్పించాలని, భవిష్యత్తులో జిల్లాలో ఇలాంటి దారుణమైన ఘటనలు పునరావృతం కాకుండా మహిళలు, బాలికల రక్షణ కోసం గట్టి నిఘా, పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, పాఠశాలలు, హాస్టళ్లు, అపార్ట్మెంట్లు మరియు ఇతర ప్రాంతాలలో బాలికల మరియు మహిళల భద్రతకు సంబంధించి ప్రత్యేక నిఘా ఉంచాలని, పోక్సో చట్టంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, బాలల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు అమలు చేయాలని కోరారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరి బాధ్యత

- మణుగూరు కోర్టు న్యాయమూర్తి కంబపు సూరి రెడ్డి

దశ, మణుగూరు: ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మణుగూరు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మణుగూరు మండలం తోగూడెం గ్రామంలోని ఇటుకల తయారీ పరిశ్రమలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ న్యాయమూర్తి కంబపు సూరి రెడ్డి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థ సమాజానికి ఒక శాపంగా మారిందని, దీనిని పూర్తిగా నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పద్నాలుగు సంవత్సరాల లోపు పిల్లలను ఏ విధమైన పనిలోనైనా నియమించడం చట్ట విరుద్ధమని, అలాంటి సంఘటనలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు లేదా పిల్లల సహాయ సేవలకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి చిన్నారికి విద్య హక్కు ఉందని, ఆ హక్కును కాపాడడం తల్లిదండ్రులు, యజమానులు, సమాజం అందరి బాధ్యత అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాల కార్మికులను పనుల నుంచి బయటకు తీసుకువచ్చి తిరిగి విద్యలోకి తీసుకురావడానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం, ప్రత్యేక శిక్షణ, ఆరోగ్య పరీక్షలు, పోషకాహారం, పునరావాసం వంటి కార్యక్రమాలు ప్రభుత్వం ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. అనాథలు, నిరాశ్రయులు, ప్రమాదంలో ఉన్న పిల్లలకు ఆశ్రయం, విద్య, సలహా సేవలు, పునరావాస కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బార్ అధ్యక్షులు గురు కృష్ణ, మండల లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, న్యాయవాది వాసవి, ఎం ఎల్ ఎస్సి కోఆర్డినేటర్ రవీందర్ లు ప్రజలకు బాల కార్మిక వ్యవస్థ దుష్పరిణామాలు, పిల్లల విద్య హక్కు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. స్థానిక కార్మికులు, గ్రామస్థులు, న్యాయ సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.